క్లుప్తంగా

రోడ్ల అభివృద్ధికి సహకరించండి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

పెదపూడి: అనపర్తి నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి సహకరించాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలతను కోరారు. బుధవారం రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆమెను ఎమ్మెల్యే కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని కొన్ని సమస్యల పరిష్కారంపై చర్చించారు. వాటిపై ఆమె సానుకూలంగా స్పందించారని, త్వరలో నిధులు మంజూరు చేయనున్నారని ఎమ్మెల్యే తెలిపారు.

విత్తన శుద్ధిపై అవగాహన



రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న గ్రామ వ్యవసాయ సహాయకురాలు

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో రైతులకు విత్తన శుద్ధి, విత్తన ఉత్పత్తిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. రామేశ్వరం, దోమాడ, తదితర గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మణిదీప్ మాట్లాడుతూ కిలో విత్తనాలకు 8 గ్రాముల సూడోమోనాస్ అనే మందు కలిపి 24 గంటల తర్వాత పొలంలో వెదజల్లుకోవాలన్నారు. విత్తనశుద్ధితో వరికి తొలి దశలో ఆశించే వేరుకుళ్లు, అగ్గి తెగుళ్లను నివారించవచ్చన్నారు. దీనిపై అవగాహన పెంచుకుంటే రైతులే సొంతంగా విత్తనాలను ఉత్పత్తి చేసుకోవచ్చన్నారు. విత్తన శుద్ధితో మొదటి 45 రోజులు ఎటువంటి పురుగు మందులు వాడాల్సిన అవసరం ఉండదన్నారు.

పీఎం కిసాన్ సాయం విడుదల

బిక్కవోలు: ప్రస్తుత సంవత్సరానికి సంబంధించి పీఎం కిసాన్ పథకం మొదటి విడత సాయంగా రూ.2 వేల చొప్పున రైతుల ఖాతాలకు ప్రధాని మోదీ జమ చేశారని వ్యవసాయ శాఖ మండల అధికారి శామ్యూల్ జాన్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి ఏడాదిలో మూడు సార్లు రూ.2 వేలు చొప్పున కేంద్రం జమ చేస్తుందన్నారు. మండలంలోని 8,635 మంది రైతులు గాను రూ.1.72 కోట్ల నగదు జమ అయ్యిందన్నారు. ఆరికరేవులు 384, బలభద్రపురం 1,177, బిక్కవోలు 1,857, ఇలపల్లి 275, కాపవరం 751, కొమరిపాలెం 522, కొంకుదురు 657, మెళ్లూరు 350, పందలపాక 692, రాళ్లకండిక 52, రంగాపురం 683, తుమ్మలపల్లి 170, తొస్సిపూడి 146, ఊలపల్లిలో 919 మంది రైతులకు నగదు జమ చేశారన్నారు.

6,370 మందికి పీఎం కిసాన్

రంగంపేట: పీఎం కిసాన్ యోజన కింద మండలంలోని 6,370 మంది రైతులకు రూ. 1.274 కోట్ల నిధులు మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఈ నిధులను విడుదల చేసిందని, మండలంలో అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.2 వేల చొప్పున జమ అవుతాయని తెలిపారు.

వినాయకునికి పంచామృతాభిషేకం



సంపరలో సిద్ధి వినాయకస్వామి

పెదపూడి: సంపర పంట కాలువ సమీపంలో ప్రసిద్ధి చెందిన సిద్ధి వినాయకుని ఆలయంలో స్వామివారికి జ్యేష్ట మాసం త్రయోదశి బుధవారం సందర్భంగా పంచామృత అభిషేక పూజలు చేశారు. అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామివారికి గరిక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

సినిమాలు

శ్యామల:	హరోంహర
సూర్యమినీ:	చందు చాంపియన్
సూర్యప్యాలెస్:	హరోంహర
స్వామి:	మహారాజ
శివజ్యోతి:	యేవమ్, సత్యభామ
అనుశ్రీ:	మనమే
రాజా:	బ్యాడ్‌బాయ్స్
ఊర్వశి:	రాజధాని రౌడీ
రంభ:	ఇంద్రాణి
మేనక:	సత్యభామ
అప్సర:	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
కుమారి:	మ్యూజిక్ షాప్ మూర్తి
నామవరం:	
వీఎస్.మహల్:	హరోంహర
ధవళేశ్వరం:	
మురళీకృష్ణ:	మ్యూజిక్ షాప్ మూర్తి
కడియం:	
వెంకటసూర్య:	హరోంహర

పనస పండు.. పోషకాలు మెండు

- మెట్ట ప్రాంత పంటకు డిమాండ్
- ఇతర ప్రాంతాలకూ ఎగుమతి

మధురపూడి: పనస.. ఈ పేరు వింటేనే మెట్ట ప్రాంతం గుర్తొస్తుంది.. పోషకాలు మెండుగా ఉండే ఈ పంట రాజానగరం నియోజకవర్గంలో అధిక శాతం సాగవుతోంది. రుచి అధికంగా ఉండడంతో ఈ పనస పండ్లకు మంచి గిరాకీ ఉంది. తోటల నుంచి తెచ్చిన పనస కాయలను రహదారుల పక్కన, దుకాణాల వద్ద విక్రయిస్తున్నాయి. ఈ పనస చెట్లను పండ్ల తోటల్లో పండిస్తున్నాయి. నిమ్మ, బత్తాయి, మామిడి, జీడిమామిడి, కొబ్బరి, జామ తోటల్లో ఈ పనస చెట్లున్నాయి. నియోజకవర్గంలోని రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాల్లో 18,520 ఎకరాల విస్తీర్ణంలో పండ్ల తోటలు ఉన్నాయి. ఇందులో పనస చెట్లు అనేకంగా ఉన్నాయి.

ఆరోగ్య ప్రదాయినిగా..

పనస పండు ఆరోగ్య ప్రదాయినిగా పేరొందాయి. ఈ పండ్లలో ఖనిజాలు ఎక్కువగా ఉంటాయి. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఏర్పడే ఫ్రీ రాడికల్స్ ప్రభావాన్ని తగ్గిస్తాయి. క్యాన్సర్‌కు కారక కణాలకు వ్యతిరేకంగా పోరాడతాయి. అలాగే చాలామందికి అజీర్తి, మలబద్ధకం సమస్యలు ఉంటాయి. అలాంటి సమస్యలను పరిష్కరిస్తోంది. దీనిలోని ఫైబర్ జీర్ణ క్రియను మెరుగుపర్చడంతో శరీరంలోని పెద్ద పేగు శుభ్రపడి మలబద్ధకం పోతుంది. అలాగే కంప్యూటర్‌తో పనిచేసే వారు, ఎక్కువగా ప్రయాణాలు చేస్తున్న వారిలో చాలా మంది కంటి చూపు సమస్యతో బాధపడుతున్నారు.



అమ్మకానికి సిద్ధం చేసిన పనస పండ్లు

పనస తొనలు తినడంతో చూపు మెరుగుపడుతోందని అధ్యాయనాలు చెబుతున్నాయి. అంతేకాకుండా కడుపులో మంట, పుండ్లు ఏర్పడితే పనసతో నయమవుతోందని వైద్యులు అంటున్నారు. అల్సర్ సమస్యలను పరిష్కరించవచ్చు. దీనిలోని కాల్షియం శరీరంలోని ఎముకల బలోపేతానికి ఉపయోగపడుతుంది. షుగర్ వ్యాధిగ్రస్తులకు ఇది మంచి ఆహారం.

పోషకాలు ఇలా..

పనసలో మెరుగైన పోషకాలు ఉన్నాయి. కార్బోహైడ్రేట్స్ 23.25 మిల్లీ గ్రాములు, ప్రోటీన్లు 1.72 మిల్లీ గ్రాములు, ఫైబర్ 1.5 మిల్లీ గ్రాములు, చక్కెర 19.08 మిల్లీ గ్రాములు, విటమిన్-ఏ ఐదు మిల్లీ గ్రాములు, విటమిన్-బీ1 నుంచి బీ9 వరకూ ఉన్నాయి.

ధర తగ్గి.. ఎగుమతులు పెరిగి

పనస ధరలు వినియోగదారులకు అందుబాటు ధరలో ఉన్నాయి. రుచికరంగా ఉండటంతో ఎక్కువ మంది తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఎగుమతులు పెరుగుతున్నాయి. పెద్ద పనసకాయ ఒక్కొటి రూ.300 నుంచి రూ.600 వరకూ పలుకుతోంది. వీటిని విజయవాడ, తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ తదితర ప్రాంతాలకు ఎగుమతులు చేస్తున్నారు. ప్రస్తుతం ధర తగ్గడంతో ఎగుమతులు పెరుగుతున్నాయి



బూరుగుపూడి తోటలో కాయలతో కళకళలాడుతున్న పనస చెట్టు

ఈ పంటకు డిమాండ్



పనస పండులో పోషకాలు అధికంగా ఉంటాయి. మెట్ట ప్రాంతమైన రాజానగరం నియోజకవర్గంలోని పంటకు డిమాండ్ అధికంగా ఉంది. ఇక్కడి నుంచి అనేక ప్రాంతాలకు ఎగుమతులు జరుగుతున్నాయి. ఇందులో పొటాషియం 448 మిల్లీగ్రాములు, కాల్షియం 24 మిల్లీ గ్రాములు, మెగ్నీషియం 29 మిల్లీగ్రాములు ఉంటుంది.

– రిని, ఉద్యాన శాఖ మండల అధికారి, కోరుకొండ

బంధువులకు పంపుతుంటాం..



వేసవి కాలంలో సెలవులకు ఇంటికొచ్చిన పిల్లలు పనస పండ్లను ఇష్టంగా తింటారు. వీటిని బంధువులకు పంపుతుంటాం. చాగల్నాడు ప్రాంతంగా పిలువబడుతున్న రాజానగరం నియోజకవర్గంలో పనస పండ్లు రుచికరంగా ఉంటాయి.

– మట్టా వెంకటేశ్వరరావు, రైతు, గుమ్ములూరు

ఆహ్లాదం... ఆనందం

- కొత్త సొబగులతో రావులచెరువు
- చిన్నారులు, పెద్దల సందడి

రాజానగరం: రాజానగరం.. ఈ పేరు వినగానే ఠక్కున గుర్తొచ్చేది రావులచెరువు. ఎందుకంటే ఈ చెరువు కారణంగానే గ్రామ ఆవిర్భావం జరిగిందని పెద్దలు చెబుతుంటారు. అంతేకాక దశాబ్దాల తరబడి రాజానగరం వాసులకే కాకుండా పరిసరాల్లోని 15 గ్రామాల ప్రజలకు దాహార్తిని తీర్చిన చెరువుగా కూడా మంచి పేరుంది. అటువంటి చెరువు వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల నుంచి కొట్టుకువచ్చే మలినాలతో పాటు పరిసరాలలో నివాసం ఉంటున్న వారు పోసే చెత్తాచెదారాలతో కలుషితమయ్యేది. ఈ తరుణంలో 2019 ఎన్నికలలో రాజానగరం నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసిన జక్కంపూడి రాజా తనను గెలిపిస్తే చెరువు ప్రక్షళన చేసి, పూర్వ వైభవాన్ని తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానని మాటిచ్చారు. అప్పటి ఎన్నికల్లో విజయం సాధించడం, వైఎస్సార్ సీపీయే అధికారంలోకి రావడంతో ఆయన చెప్పిన మాటను అనతికాలంలోనే ఆచరణలో చూపారు. సుమారు రూ. రెండున్నర కోట్లతో చెరువును ప్రక్షాళన చేసి, గట్టును పటిష్ఠపర్చడంతోపాటు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వైపు త్రికోణంగా ఉన్న ప్రాంతాన్ని పూడ్చి, అందరినీ ఆకట్టుకునే రీతిలో పార్కును సుందరంగా మలిచారు. పుణ్యతిథులలో స్నానాలు చేసేందుకు వీలుగా పెద్ద పాంచాలను నిర్మించారు. ప్రస్తుతం ఈ పార్కు గ్రామంలోని



విద్యుత్ దీపాల వెలుగుల్లో రావులచెరువు పార్కు



పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు

పిల్లా, పెద్దలనే కాకుండా పొరుగు వారిని కూడా విశేషంగా ఆకట్టుకుంటుంది. ఇదే పార్కులో జిమ్‌లను కూడా ఏర్పాటు చేయడంతో యువత ఉదయం, సాయంత్రం వేళలలో వ్యాయామం చేస్తున్నారు. ఇక పార్కులో పిల్లలు ఆడుతుంటే వారి కళ్లలో ఆనందాన్ని చూస్తూ పెద్దలు ఎంజాయ్ చేస్తున్నారు. అలాగే పార్కులో విద్యుత్తు వెలుగులు, ఐలవ్ రాజానగరం కూడా ఎంతో ఆకట్టుకుంటోంది. ఇక్కడ వచ్చేవారు ఏర్పాటు చూసి అచ్చెరువు పొందుతున్నారు.



పార్కులో చెరువు గట్టున ఏర్పాటు చేసిన 'ఐ లవ్ రాజానగరం'

అందరినీ ఆకర్షించేలా..

రావులచెరువులో పేరుకుపోయిన మలినాలను తీసి పారేయడంతోపాటు గట్టును కూడా అభివృద్ధి చేయడంతో చెరువుకు కొత్త కళవచ్చింది. గట్టు చుట్టూ రాతితో పటిష్ఠ పరిచి, అవసరమైన చోట పాంచాలను నిర్మించారు. అంతేకాక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వైపు 'ఐ లవ్ రాజానగరం' పేరుతో ఏర్పాటు చేసిన పార్కు చిన్నా పెద్ద అని తేడా లేకుండా అందరినీ ఆకట్టుకుంటుంది.

– పద్మకళ, సూర్యారావుపేట

రూపురేఖలు మారాయి

ఒకప్పుడు రావులచెరువుకు, ఇప్పుడు ఉన్న రావులచెరువుకు అసలు సంబంధమే లేదు. చాలా బాగా అభివృద్ధి చేశారు. సాయంత్రం వేళల్లో చెరువు గట్టున ఉన్న పార్కు వద్ద పిల్లలు, పెద్దలతో ఎంతో సందడి కనిపిస్తుంది. ఇక్కడకు వచ్చి కూర్చుంటే ఎంతో రిలాక్స్ అయినట్టు ఉంటుంది.

– మనోజ్‌సూర్యకుమారి, రాజానగరం

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

కంబాలచెరువు: పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన పోలీసు యంత్రాంగం పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను ఎస్పీ పి.జగదీష్ అందజేశారు. డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఫండ్ నుంచి పోలీసు అధికారుల పిల్లలు 56 మందికి స్కాలర్‌షిప్‌లను స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో అందించారు. అనంతరం స్కూల్ యాజమాన్యాలను ఎస్పీ సత్కరించారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించినందుకు పిల్లలను అభినందించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ తల్లిదండ్రులను ఎల్లప్పుడూ గౌరవించాలని, వారి కలలను సాకారం చేయడానికి కష్టపడి చదవాలన్నారు. విజయవంతమైన వ్యక్తులుగా ఎదగాలని, ఉన్నత శిఖరాలు, లక్ష్యాలను సాధించాలని కోరారు. పిల్లలు తమకు కావాల్సిన వృత్తిని అభ్యసించి, సమాజానికి మేలు జరిగేలా సేవ చేయాలన్నారు. అడిషనల్ ఎస్పీలు (ఏఆర్) ఎల్.చెంచిరెడ్డి, డీఎస్పీలు, ఆర్‌ఐ, జిల్లా పోలీసు అధికారుల సంఘం ప్రెసిడెంట్ ఆర్.రఘురాం, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



మెరిట్ విద్యార్థికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న జిల్లా ఎస్పీ జగదీష్

మిన్నకుండిపోయారు..!



ఇసుక వీధిలో దెబ్బతిన్న మ్యాన్‌హోల్‌పై ఉంచిన కుండీ

రాజమహేంద్రవరం సిటీ: సమస్య చిన్నదే అయినా పరిష్కారంలో మిన్న'కుండి'పోతున్నారు.. మరో ప్రమాదాన్ని సృష్టిస్తున్నారు.. అచ్చం అలానే స్థానిక 23వ డివిజన్ వాటర్ వర్క్స్ స్ట్రీట్ (ఇసుక వీధి)లో పరిస్థితి ఉంది. ప్రధాన వాటర్ వర్క్స్‌కు అతి సమీపంలో అసలే ఇరుకుగా ఉండే ఈ వీధిలో నగరపాలక సంస్థ అధికారులు సెంటర్ అండర్ డ్రైనేజీ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ఈ డ్రైనేజీలపై ఇనుప మ్యాన్‌హోల్స్ అమర్చారు. అంత వరకూ బాగానే ఉంది. ఇవి నాలుగు చోట్ల దెబ్బతిన్నాయి. నిత్యం పర్యవేక్షణ చేసే అధికారులు దెబ్బతిన్న మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు చేపట్టాల్సిందిపోయి రక్షణ పేరుచెప్పి మరో ప్రమాదాన్ని తెచ్చిపెట్టారు. సరిగ్గా రోడ్ మధ్యలో దెబ్బతిన్న మ్యాన్‌హోల్‌పై సిమెంట్ కుండీని పెట్టారు. దారి మధ్యలో ఇది ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయాల్లో మరింత ఇబ్బందిగా పరిణమిస్తోంది. మెయిన్‌రోడ్ నుంచి గోదావరి గట్టుకు వెళ్లేదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ మ్యాన్‌హోల్స్‌పై నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సికిల్ సెల్ ఎనీమియా అంటువ్యాధి కాదు



సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాహన కల్పించే వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: సికిల్ సెల్ ఎనీమియా అంటువ్యాధి కాదని, జన్యుపరంగా తల్లిదండ్రుల నుంచి మాత్రమే సంక్రమిస్తుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం బొమ్మూరులోని జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ బాలికల ఉన్నత పాఠశాల వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి ఒకరి నుంచి మరొకరికి గాలి, నీరు, చర్మం, ఆహార అలవాట్ల వల్ల గాని రాదన్నారు. వ్యాధి లక్షణాలు శరీరం తెల్లగా పాలిపోవడం, కళ్లు, నాలుక పచ్చగా ఉండడం, వయసు తగ్గ ఎత్తు బరువు లేకపోవడం, కాళ్ల జాయింట్ వద్ద వాపులు ఉంటాయన్నారు. సరైన చికిత్స చేయకపోతే గుండె తదితర ప్రాణాంతక వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందని, అందువల్ల చికిత్స పొందాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యాధి ప్రభావిత గిరిజన ప్రాంతాల్లో జీరో నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న జనాభాకు అవగాహన కల్పించడం, నిర్ధారణ పరీక్షలు, కౌన్సెలింగ్‌లు నిర్వహిస్తుందని డీఎంహెచ్‌ఓ తెలిపారు. జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి హరిశ్చంద్ర మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా అనే వ్యాధి వారసత్వంగా వచ్చిన ఎర్రరక్త కణాల రుగ్మతల సమూహం అని అన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ సాధికారత అధికారి జ్యోతి మాట్లాడుతూ ఈ వ్యాధి వచ్చిన వారిలో రక్తహీనతతో కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు కలిగి ఉండడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట తరచూ వచ్చే అంటువ్యాధులు, గర్భధారణ సమయంలో సమస్యలు అవయవ నష్టం అనగా వైకల్యం కలగవచ్చన్నారు. డీపీఎంయూ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ అభిషేక్‌రెడ్డి, జిల్లా ఏపీడమాలజిస్ట్ సుధీర్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.సీత తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు పరిష్కరించండి

కంబాలచెరువు: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని కోర్టుల్లో పెండింగ్‌లో కేసులను పెద్దఎత్తున పరిష్కరించేందుకు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవా సంస్థ చైర్మన్ గంధం సునీత సూచించారు. ఈ నెల 29న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎస్పీలు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ఇతర పోలీస్ అధికారులతో స్థానిక డీఎల్ఎస్ఏ కార్యాలయంలో సునీత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాశబాబు సమావేశం నిర్వహించారు. అనంతరం తూర్పుగోదావరి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులతో వీడియో కాన్ఫరెన్స్ జరిపారు. లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులను పెద్దఎత్తున పరిష్కరించాలన్నారు. అదనపు జిల్లా కోర్టుల్లో మోటారు వాహన ప్రమాద కేసులను పరిష్కరించి బాధితులకు పరిహారం అందించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఇవే కాకుండా భూ వివాదాలు, ఆస్తి తగాదాలు, రెవెన్యూ, మున్సిపల్, ఇతర నెగోషబుల్ కేసుల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ పి.జగదీష్, కాకినాడ జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్, కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, ఏఎస్ఆర్ జిల్లా ఎస్పీ ఎ.జగదీష్, ట్రాఫిక్, డీసీఆర్‌బీ అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.



ఎస్పీలు, పోలీసు అధికారులతో మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవా సంస్థ చైర్మన్ గంధం సునీత

యోగా శిక్షణ సద్వినియోగం చేసుకోండి

రాజానగరం: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని దివాన్‌చెరువు ధరణి గోదావరి విద్యా పీఠంలో శుక్రవారం యోగా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు ఓ ప్రకటనలో కోరారు.

గాడాలలో వెంకన్నబాబు గ్రామోత్సవం



వేంకటేశ్వర స్వామివారు

మధురపూడి: కోరుకొండ మండలం గాడాలలోని వెంకన్నబాబు గ్రామోత్సవం బుధవారం రాత్రి ఘనంగా జరిగింది. కొన్ని రోజులుగా శ్రీవినాయక వెంకటసాయి ఆలయంలో కమిటీ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా వేంకటేశ్వర స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయం నుంచి ప్రారంభమై ప్రధాన వీధుల మీదుగా ఈ కార్యక్రమం సాగింది. స్వామివారిని భక్తులు దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద గురువారం అన్నసమారాధన జరుగనుంది. భక్తులంతా హాజరై స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించాలని కమిటీ కోరింది.

నేడు రెవెన్యూ దినోత్సవం

రంగంపేట: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ దినోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లతీఫ్‌పాషా బుధవారం తెలిపారు. మండలంలోని ప్రజలంతా హాజరై విజయవంతం చేయాలన్నారు.

ఇంధన పొదుపు పాటిద్దాం



సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న హెచ్‌ఎం పార్థసారథి

రంగంపేట: ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపు పాటించాలని హెచ్‌ఎం వి.పార్థసారథి తెలిపారు. బుధవారం రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏకోక్లబ్ ఆధ్వర్యంలో సేవ్ ఎనర్జీ కార్యక్రమంలో భాగంగా సైకిల్ ర్యాలీని ప్రారంభించి విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఇంధనాన్ని పొదుపు చేయడం, శారీరక ఆరోగ్యానికి సైకిల్ వినియోగించడం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి చిన్న విషయానికి బైక్ లేదా ఇతర వాహనాలపై ఆధారపడటం మంచిది కాదని చెప్పారు. ఇంధన పొదుపుపై తల్లిదండ్రులకు, గ్రామస్తులకు అవగాహన కల్పించాలని ఆయన విద్యార్థులకు సూచించారు. ఎల్ఈడీ బల్బు వినియోగం ఆవశ్యకతను తొమ్మిదో తరగతి విద్యార్థినులు భవ్య, ధన్యతలు తెలిపారు. ఉపాధ్యాయులు వి.రమ్యసుధ, జాకబ్, చార్లెస్, పీడీ శైల, వరలక్ష్మి, సావిత్రి, రాజేశ్వరి, సత్య వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కళాసమ్మేళన్ సంగీత పోటీలు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): శ్రీరాధాకృష్ణ కళాక్షేత్ర, శ్రీరాధాకృష్ణ ట్రస్టు ద్వారా గురువారం నుంచి 23వ తేదీ వరకూ అంతర్జాతీయ సంగీత పోటీలు, ప్రదర్శనలు నిర్వహించనున్నామని నిర్వాహకుడు డాక్టర్ జీబీ నారాయణ తెలిపారు. బుధవారం స్థానిక సంస్థ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇక్కడి ఆనం కళాకేంద్రంలో నగరపాలక సంస్థ, గెల్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఈ కళా సమ్మేళన్ నిర్వహిస్తున్నామన్నారు. రోజూ 100 మంది కళాకారులు వారి ప్రతిభను కనబరుస్తారన్నారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ కార్యక్రమాలు ఉంటాయన్నారు. బెంగళూర్, చెన్నై, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మలేషియా, యూఎస్ నుంచి కళాకారులు హాజరవుతారని అన్నారు. 21న 150 మంది విద్యార్థులు ఒకే ఆహార్యంలో కనకధారా స్తోత్రాన్ని 16,200 సార్లు ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల పాటు నిర్విరామంగా ప్రదర్శిస్తారన్నారు. ఎటువంటి రుసుం లేకుండా కళాకారుల ప్రతిభను గుర్తించడానికి ఈ ప్రయత్నం చేస్తున్నామన్నారు. మన సనాతన ధర్మాన్ని కాపాడేందుకు ఈ బాధ్యతను తీసుకున్నామన్నారు. కనుమరుగవుతున్న జావళీలను కళాకారులు ప్రదర్శించనున్నారన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ



వృద్ధులకు చీరలు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు మురళీధర్

రాజమహేంద్రవరం సిటీ: దేశంలో ప్రజల హక్కులు పరిరక్షించాలంటే రాహుల్ గాంధీ ప్రధాని కావాల్సిన ఆవశ్యకత ఉందని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ అన్నారు. బుధవారం రాహుల్ గాంధీ పుట్టినరోజును పురస్కరించుకుని స్థానిక వీరభద్రపురం గాంధీ కస్తూరిబా స్త్రీల సదనంలో కేక్ కట్ చేసి చీరలు, మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సార్లు వేల కిలోమీటర్లు భారత్ జోడో న్యాయ యాత్ర నిర్వహించి అన్నివర్గాల ప్రజల సమస్యలతో పాటు దేశం ఎదుర్కొంటున్న సమస్యలను రాహుల్ తెలుసుకున్నారన్నారు. కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు మోతా శారద, పీసీసీ సభ్యుడు చింతాడ వెంకటేశ్వరరావు, నాయకులు కిశోర్‌కుమార్ జైన్, యిజ్జరౌతు విజయలక్ష్మి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు బిల్డర్ బాబీ పాల్గొన్నారు.